APTEL 2009/31957
# నీలగిరి వార్త
మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక
neelagirivartha@gmail.com
ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | శనివారం | 19-04-2025 | సంపుటి : 15 | సంచిక : 261 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి



మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు 2లో



33 మంది నక్సల్స్ లొంగుబాటు 2లో

# రేవంత్‌రెడ్డిపై విచారణ చేపట్టాలి

- ప్రధాని మోడీకి కేటీఆర్ వినతి
- రేవంత్ సర్కార్ కుంభకోణాలపై ప్రధాని మాట్లాడరేం?
- కంచగచ్చిబౌలి భూముల విధ్వంసం పర్యావరణ అంశమే కాదు?
- కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నిర్వాకం రూ.10 వేల కోట్ల ఆర్థిక మోసం!



**ప్రత్యేకప్రతినిధి - నీలగిరివార్త :**
కంచగచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ జరిపి కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలని ప్రధాని మోదీని కోరారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. హెచ్‌సీయూలో జరిగిన విధ్వంసం విషయంలో మోదీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. హెచ్‌సీయూలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన విధ్వంసంపై ప్రధాని మోదీ మాట్లాడింది కేవలం బూటకం కాకుంటే చర్యలు తీసుకోవాలన్నారు ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. కంచ గచ్చి బౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.10 వేల కోట్ల ఆర్థిక మోసమని అన్నారు. కాంగ్రెస్ చేసిన ఆర్థిక మోసంపై ఇప్పటికే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీఐ, ఆబీఐ, సెబీ, ఎస్ఎఫ్ఐఓలకు ఆధారాలతో సహా తెలియజేశామని చెప్పారు. ఆర్థిక అవకతవకలు జరిగినట్లు కేంద్ర సాధికార కమిటీ కూడా నిర్ధారించిందని, స్వతంత్ర విచారణ చేయాలని కేంద్ర సాధికార కమిటీ సూచించిందని గుర్తు చేశారు. ఆర్థిక అక్రమాలపై వెంటనే కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని కోరారు. నగరాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. నిస్సిగ్గుగా,అక్రమంగా పర్యావరణ విధ్వంసం చేసిన రేవంత్ రెడ్డి లాంటి నాయకులను ప్రజల ముందు నిలబెట్టాల్సిన అవసరం ఉందన్నారు

మిగతా 2వ పేజీలో...



## మజ్లిస్ పార్టీ ఉచ్చులో కాంగ్రెస్, బిఆర్ఎస్

- మూడు పార్టీలది తెలంగాణను ముంచే ఎజెండా
- ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్- నీలగిరివార్త :**
ప్రజలను దోపిడీ చేసి.. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడి.. ప్రజల రక్తం తాగిన మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జీ హుజూరంటున్నాయని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై కిషన్ రెడ్డి విర్శలు గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి తెలంగాణను ముంచే ఎత్తుగడలు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం బేగంపేట హరిత ప్లాజాలో జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. పార్టీ నాయకులు, శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు పోటీ- చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీకి వంగి వంగి సలాం కొడుతున్న రాహుల్ గాంధీ, కేసీఆర్‌లకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రజాకార్ల వారసత్వాన్ని పొందిన మజ్లిస్ పార్టీకి

మిగతా 2వ పేజీలో...

## రేవంత్ సర్కార్ ఉంటుందో ఊడుతుందో!

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వ్యాఖ్యలు

వరంగల్- నీలగిరివార్త : అబద్ధాల పునాదులపై నిర్మితమైన రేవంత్‌రెడ్డి సర్కార్ ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయాందోళన నడుమ ఊగిసలాడుతున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసత్యపు హామీలు, ఆరు గ్యారెంటీ-లంటూ ప్రజలను నమ్మించి ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ సర్కార్

మిగతా 2వ పేజీలో...






## విశ్వ మానవాళికి గీతోపదేశమే!

- భగవద్గీత, నాట్యశాస్త్రానికి అంతర్జాతీయ గుర్తింపు
- యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు
- కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పోస్ట్
- భారతీయులు గర్వించే విషయమన్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
భారతీయ సంస్కృతి, వారసత్వానికి చరిత్రాత్మక గుర్తింపు లభించింది. శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతతో పాటు భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు.. యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించు కున్నాయని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో వెల్లడిం చారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీత, నాట్యశాస్త్రాన్ని

మిగతా 2వ పేజీలో...

## రూ.10,500కోట్లు!

- జపాన్ పర్యటనలో భారీ పెట్టుబడుల సాధన
- రూ. 10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు
- సిఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఒప్పందం



**హైదరాబాద్- నీలగిరివార్త :**
జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులను సాధించింది. రూ. 10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్‌టీటీ- డేటా, నెయిసా సంస్థలు సంయుక్తంగా ఈ డేటా సెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నాయి. టోక్యోలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందాలపై ప్రభుత్వ అధికారులు, సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. మ-రోవైపు రుద్రారంలో రూ.562 కోట్లతో మరో పరిశ్రమ ఏర్పాటుకు తోషిబా ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే తోషిబా అనుబంధ సంస్థ టీటీడీఐ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలకు ఈ ఒప్పందం జరిగింది. రుద్రారంలో ఇప్పటికే ఈ సంస్థ రెండు ఫ్యాక్టరీలను నిర్వహిస్తోంది. ఈ భారీ పెట్టుబడులపై సీఎం రేవంత్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పెట్టు-బడులు వస్తున్నాయి. తెలంగాణలో సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం ఇస్తోంది. నిపుణులు ఉన్నందున ఏఐ డిజిటల్ సేవల్లో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోంది. ఎన్‌టీటి భారీ పెట్టుబడులతో డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం సుస్థిరంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టీటీ-డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా

మిగతా 2వ పేజీలో...

## భూభారతితో సమస్యలకు చెక్

- ధరణితో ఇష్టారీతిన భూ బదలాయింపులు
- పైసా ఖర్చు లేకుండా భూభారతిలో ఫిర్యాదులు
- తహసిల్దార్ పరిధిలో సమస్యలు పరిష్కారం
- ఉమ్మడి జిల్లాకు ఒక సిసిఎల్ఏ, ట్రిబ్యునల్ ఏర్పాటు
- వెంకటాపూర్‌లో భూభారతి అవగాహన సదస్సులో పొంగులేటి



**ములుగు- నీలగిరివార్త :**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం సామాన్య రైతులకు న్యాయం జరిగేవిధంగా ఉంటుందని, రైతుల కళ్లలో ఆనందం చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్మని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూ భారతి కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూ భారతి రెవన్యూ సదస్సుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ, సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ బుద్ధ ప్రకాష్ తదితరులు హాజరయ్యారు. భూ భారతి రెవెన్యూ సదస్సును ప్రారంభించిన అనంతరం మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నముక రైతు అని, రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైధరణి పోర్టల్ తీసుకువచ్చి గులాబీ నాయకులు ఇష్టా రీతిని వారి పేర్లపై వందల ఎకరాలు పట్టాలు చేయించుకుని, చట్టాన్ని చుట్టంగా మలుచుకుని రైతు బంధు పొందారు తప్పా సామన్య పేదరైతుకు న్యాయం జరిగిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడగానే ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలిపి సామాన్య రైతుకు శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా భూ భారతి చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చిన మేరకు భూ భారతి చట్టం తీసుకువచ్చామని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లాలోని వెంకటాపూర్

మిగతా 2వ పేజీలో...



## దళిత విద్యార్థులు వివక్షకు గురికావద్దు

- రోహిత్ వేముల చట్టాన్ని రూపొందించండి
- కర్నాటక సిఎం సిద్దరామయ్యకు రాహుల్ లేఖ

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
ఆత్మహత్య చేసుకున్న సెంట్రల్ వర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల పేరు అందరికీ గుర్తుండే ఉంటుంది. గతంలో పలు కారణాలతో హెచ్‌సీ-యూలో ఆత్మహత్యకు పాల్పడ్డ దళిత విద్యార్థి రోహిత్ వేముల పేరును చాలా కాలం తర్వాత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తావించారు. విద్యావ్యవస్థలో నేటికి

మిగతా 2వ పేజీలో...

## హెచ్‌సీయు భూములపై మరో దావా!

- సుప్రీం కోర్టులో బీ ద చేంజ్ సంస్థ పిటిషన్
- ప్రగతికి పర్యావరణ పరిరక్షణ విరుద్ధం కాదు : రామ్ కల్యాణ్
- యూనివర్శిటీ పరిధిలోని భూమిని రక్షిత అడవిగా గుర్తించాలి
- పర్యావరణ ఉద్యమకారులు, విద్యార్థి సంఘాలు పిటిషన్‌కు మద్దతు



**ప్రత్యేకప్రతినిధి - నీలగిరివార్త :**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లోని విలువైన పచ్చదనాన్ని కాపాడేందుకు బీ ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది యూనివర్సిటీ భూమిని రక్షిత అడవిగా గుర్తించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది.అరుదైన వృక్షజాలం, జంతుజాలం ఉన్న ఈ ప్రాంతాన్ని నిర్మాణాల కారణంగా నాశనం కాకుండా కాపాడాలని కోరారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పరిధిలోని విలువైన పచ్చదనాన్ని రక్షించేందుకు బీ ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ మరోసారి న్యాయపోరాటానికి దిగింది. యూనివర్శిటీ పరిధిలోని పలు ఎకరాల భూమిని రక్షిత అడవిగా గుర్తించాల్సిన అవసరం ఉందని కోర-ంతూ,దేశ అత్యున్నత న్యాయస్థానం ఐన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సొసైటీ అధ్యక్షుడు రామ్ కల్యాణ్ చల్ల నేతృత్వంలో దాఖలైన ఈ పిటిషన్ లో ప్రస-్తుతం యూనివర్శిటీ పరిధిలో ఉన్న అడవి ప్రాంతాన్ని నిర్మాణాలు, అభివృద్ధి పేరిట నాశనం చేయడంపై తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూమిలో పలు అరుదైన వృక్షజాలం,పక్షులు,వన్యప్రాణులు నివసిస్తున్నాయని, అంతేకాకుండా ఇది విద్యార్థులకు, పరిశోధకులకు జీవ పరిసరాల అధ్యయనానికి అనువైన ప్రాంతమని పిటిషన్ లో పేర్కొంది. ఈ భూమిని వాణిజ్యాభివృద్ధి, లేదా ఇతర విధాల

మిగతా 2వ పేజీలో...

## ఆలస్యం అమృతం విషం

- రేవంత్‌కు జరుగుతున్నది ఇదే!
- ఆశావహుల తొందరపాటు చర్యలతో బీఆర్ఎస్ చేతికి కత్తి?
- తాజాగా లిస్టులో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేరినట్లుగా లేఖ?
- మంత్రి పదవి కోసం 100 కోట్లు ఖర్చు చేశామని లేఖ విడుదల?
- పదవి ఇవ్వకుంటే రేవంత్ భరతం పడ్తామని వాకిటి అభిమానుల లేఖ?

**ప్రత్యేకప్రతినిధి - నీలగిరివార్త :**
మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కాలయాపన బీఆర్ఎస్ కు అడ్వాంటేజ్ గా మార-ుతోంది. ఏడాదిన్నరకాలంగా కేబినెట్ విస్తరణ చేపట్టలేదని విమర్శిస్తూనే రేవంత్ సర్కార్ ను ఇరకాటంలోకి నెట్టేలా ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. ఆశావహులు కూడా తొందరపాటు చర్యలతో బీఆర్ఎస్ చేతికి కత్తి అందిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా తనకు పదవి రాకుండా జానారెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కామెంట్స్ చేసిన మరుసటి రోజే మరో నేత పెదవి విరిచారు. వివేక్ కుటుంబం తనకు కేబినెట్ లో చోటు దక్కకుండా ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పరోక్ష వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆ లిస్టులో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేరినట్లుగా ఓ లేఖ బయటకు వచ్చింది. ఎమ్మెల్యే టికెట్ కోసం 10 కోట్లు ఇచ్చామని, మంత్రి పదవి కోసం 100 కోట్లు ఖర్చు చేశామని తీరా మంత్రి పదవి వచ్చే సమయానికి అడ్డు పడుతున్నారు అంటూ వాకిటి శ్రీహరి అభిమానుల పేరిట బయటకు వచ్చిన లేఖ సంచలనం రేపుతోంది.నిజంగా ఈ లేఖ వాకిటి అభిమానులే

మిగతా 2వ పేజీలో...



## ట్రైన్‌లో అత్యాచారం ఘటన అంతా..ఉత్తిదే

**యువతి నాటకం నడిపినట్లు గుర్తించిన పోలీసులు**

**హైదరాబాద్- నీలగిరివార్త :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైన్‌లో అత్యాచారయత్నం ఘటన కేసు ఇప్పుడు సంచలన మలుపు తిరిగింది. యువతి పై జరిగినదన్న అత్యాచారం అబద్ధంగా తేలింది. ఈ కేసులో రైల్వే పోలీసులు చేపట్టిన లోతైన దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తూ ట్రైన్ లోనుండి జారిపడిన యువతి, అనంతరం తనపై అత్యాచారం జరిగిందని కథ అల్లింది. ఆమె కథనాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో అనుమానితులుగా 100 మందిని పోలీసులు విచారించగా, అసలు విషయానికి దగ్గరయ్యారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పోలీసులు 250 సీసీటీవీ కెమెరాల ఫుటేజీ ని పరిశీలించారు. అనేక కోణాల్లో వీడియోలను అధ్యయనం చేసిన అనంతరం, యువతి కథనాల్లో అనేక అనుమానాస్పద అంశాలు బయటపడ్డాయి. ఎటు-వంటి ఆధారాలు ఆమె చెప్పిన కథనాలను సమర్థించలేదని పోలీసులు తేల్చారు. విచారణలో చివరికి యువతి అసలు విషయం వెల్లడించింది. రీల్స్ చేస్తూ ట్రైన్ నుంచి జారిపడిన విషయాన్ని దాచిపెట్టి, అత్యాచారం జరిగినట్లు అబద్ధం చెప్పినట్లు- ఒప్పుకుంది. పోలీసులు లీగల్ ఒపీనియన్ తీసుకుని, ఎటు-వంటి అత్యాచారం జరగలేదని నిర్ధారించి కేసును మూసివేశారు.

## విద్యార్థుల వీసాల రద్దులో 50శాతం భారతీయులే

**ఆందోళన వ్యక్తంచేసిన కాంగ్రెస్ పార్టీ**

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :** అమెరికాలోని విదేశీ విద్యార్థుల వీసాలను ట్రంప్ యంత్రాంగం పెద్ద మొత్తంలో రద్దు చేస్తున్న క్రమంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవేనని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ అమెరికా దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 327 వీసా రద్దు కేసులు తమకు అందినట్లు అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయ-ర్స్ అసోసియేషన్ తాజాగా ప్రకటన జారీ చేసింది. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది.అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్‌కు అందిన నివేదికల ప్రకారం ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50శాతం భారతీయులు ఉన్నారని.. అయితే వారి వీసా రద్దుకు సరైన కారణాలు పేర్కొనలేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నివేదిక ప్రకారం.. వీసాలు రద్దు చేసిన విద్యార్థుల్లో 50శాతం మంది భారత్‌కు చెందినవారు కాగా 14శాతం మంది చైనా దేశీయులు. తర్వాతి స్థానాల్లో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు ఉన్నారు. దీనిపై ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ మాట్లాడుతూ.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్, ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంతర్జాతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొంది. ఈవిషయంపై భారత విదేశాంగ శాఖ నుంచి ఎటు-వంటి స్పందన లేదు. చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. తాజాగా ట్రంప్ యంత్రాంగం పలు యూనివర్సిటీలలోని విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. విదేశాంగ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో చదువులు కొనసాగించలేకపోతున్నామని.. తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా నిరసన కార్యక్రమాలలో పాల్గొనని వారి వీసాలు కూడా రద్దయినట్లు- కళాశాలలు పేర్కొంటున్నాయి. వీసాల రద్దుకు అధికారులు సరైన కారణాలు కూడా తెలియ జేయట్లేదని విద్యార్థులు వాపోయారు.

## పంజాబ్ ఉగ్రవాది హర్‌ప్రీత్ సింగ్ అరెస్ట్

**అమెరికాలో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**చండీఘడ్- నీలగిరివార్త :** పంజాబ్ పోలీసుల్ని వణికించిన ఉగ్రవాది హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపి పాసియాను అమెరికాలో అరెస్టు చేశారు. హర్‌ప్రీత్ అరెస్టుకు చెందిన ఫోటోలను విడుదల చేశారు. అతన్ని ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కస్టడీకి తీసుకెళ్లారు. అక్రమ రీతిలో అమెరికాలో ప్రవేశించిన హరిప్రీత్ .. బర్నర్ ఫోన్ల ద్వారా అరెస్టు నుంచి ఇన్నాళ్లూ తప్పించుకున్నాడు. ఇండియాలో అతను మోస్ట్ వాంటెడ్ క్రిమనల్. అతని తలపై 5 లక్షల నజరానా కూడా ఉన్నది. పంజాబ్‌లో ఇటీవల జరిగిన హింసకు ఇతనే ప్రధాన కారకుడు. గడిచిన ఆరు నెలల్లో 14 ఉగ్రదాడులు జరడానికి కారణంగా హరిప్రీత్ అని పోలీసులు పేర్కొన్నారు. 2024 నవంబర్ నుంచి అమృత్‌సర్‌లో వరుసగా పేలుళ్లు జరిగాయి. ఆ పేలుళ్ల వెనుక ఇతన హస్తం ఉన్నట్లు- తేలింది. పేలుళ్లకు తానే కారణమని అతను సోషల్ మీడియాలో ప్రచాచం చేశాడు. పాకిస్థా-న్‌కు చెందిన ఐఎస్ఐ, బబ్బార్ కల్సా ఇంటర్నేషనల్‌తో జత కలిసి హరిప్రీత్ సింగ్ పంజాబ్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడినట్లు- భద్రతా దళాలు ఆరోపించాయి. తాజాగా ఓ యూట్యూబర్ ఇంటితో పాటు- బీజేపీ నేత మనోరంజన్ కాలియా ఇంటిపై కూడా అతను దాడి చేయించాడు. ఈ రెండు ఘటనలు జలంధర్‌లోనే జరిగాయి.

## రాష్ట్రానికి ఏం చేశారో కిషన్ రెడ్డి చెప్పాలి

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం**

**హైదరాబాద్- నీలగిరివార్త :** తెలంగాణలో బీజేపీ,బీఆర్ఎస్ నాటకాలాడుతన్నాయని టీపీసీసీ చీఫ్ మహేహ్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ తో కలిసి కిషన్ రెడ్డి లాలూచీ నాటకాలాడుతున్నారని మండిపడ్డారు. పొద్దున లేస్తే కులాలు ,మతాలు పంచాయతీ పెట్టేప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి కాదు కిస్మత్ రెడ్డి. కష్టం లేకుండా గెలుస్తున్నారని అన్నారు. మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. పొద్దున లేస్తే కిషన్ రెడ్డి ముస్లిమ్ జపం చేస్తడు. అక్బరుద్దీన్ ఒవైసీ మీదనే కిషన్ రెడ్డి రాజకీయం చేస్తడు. పోయిన జన్మలో ఒవైసీ, కిషన్ రెడ్డి బ్రదర్స్ అయి ఉంటారని అన్నారు. చెప్పుతో ఎవరిని కొడతారు కిషన్ రెడ్డి. నువ్ మగాడివి అయితే 10 ఏండ్లలో నీ నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చకు రా అంటూ సవాల్ చేశా-రు. దిగజారుడు భాష రాజకీయాల్లో మంచిది కాదు. 8 మంది ఎంపీలు ఎమ్మెల్యేలు,ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండీ రాష్ట్రానికి ఏం తెచ్చారని నిలదీసారు.. కిషన్ రెడ్డికి మతం తప్ప అభివృద్ధిపై దృష్టి లేదు. రాష్ట్ర అభివృద్ధిపై కిషన్ రెడ్డి, సంజయ్ ..ఎంపీలతో ఏనాడైనా మాట్లాడారా.పనికిరాని వాళ్లు ఏఐ పోస్టులు పెడితే కిషన్ రెడ్డి వాటిని కాపీ కొడతాడు. బండి సంజయ్ ఎపుడు ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదు. సన్నబియ్యం కేంద్రానివి అంటడు. మరి బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఎందుకివ్వట్లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆలస్యం అమృతం విషం

**మొదటిపేజీ తరువాయి..**

విడుదల చేశారా? అనేది అనుమానాస్పదంగా మారిన నేపథ్యం. మంత్రివర్గ విస్తరణ జరిగితే వాకిటికి వచ్చిన డోఖా ఏమి లేదు. ఆయన సామాజిక వర్గంతోపాటు రేవంత్ ఇచ్చిన హామీ ఆయనకు పదవిని తప్పకుండా వరించేలా చేస్తుంది. అయినా, పార్టీకి వందకోట్లు ఇచ్చామని, పదవి ఇవ్వకపోతే రేవంత్ భరతం పడుతామని వాకిటి అభిమానులు లేఖ విడుదల చేశారా అంటే ఎవరికీ నమ్మశక్యంగా అనిపించడం లేదు. వాకిటి శ్రీహరికి పదవిని అడ్డుకునేందుకు ఆయన వ్యతిరేకులు రేవంత్ ను ఇరకాటం లోకి నెట్టివేసేందుకు ఈ లేఖను విడుదల చేసి ఉంటారని విమర్శలు వస్తున్నాయి. వీటిని లైట్ తీసుకుంటే కాంగ్రెస్ పై , రేవంత్ పై మరిన్ని విమర్శలు, ఆరోపణలు చెలరేగే అవకాశం ఉంది. మరి సర్కార్ ఎలాంటి చర్యలు చేపడుతుందో? ఎదురు చూడాల్సిందేనని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# బిఆర్ఎస్ సభలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు

**ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్న పార్టీ అధినేత కెసిఆర్**



**గజ్వేల్- నీలగిరివార్త :** ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగన న్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలన్నారు. సభపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ మహిళా నేతలతో పాటు పలువురు నాయకులతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుసరిం చాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించిన తగిన సూచనలు చేస్తూ కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, పార్టీ మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్ పర్సన్ రజినీ సాయిచంద్, నవీన్ ఆచారి, పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌ఘడ్‌లో 33 మంది నక్సల్స్ లొంగుబాటు

**అందరూ లొంగిపోవాలని అమిత్ షా పిలుపు**



**రాయ్‌పూర్- నీలగిరివార్త :** వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సలైట్లను తుదముట్టిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గురువారం మరోమారు ప్రకటించిన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో 33 మంది నక్సలైట్లు శుక్రవారంనాడు లొంగిపోయా-రు. వీరిలో 17మంది నక్సల్స్‌పై రూ.49లక్షల రివార్డు ఉంది. తాజాగా లొంగిపోయిన వారిలో తొమ్మిది మంది మహిళలతో సహా 22 మంది సీనియర్ పోలీసులు అధికారులు, సీఆర్‌పీఎఫ్ ముందు లొంగిపోయారు. ఆ తర్వాత మరో 11 మంది పోలీసు అధికారుల ముందు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు మహిళా నక్సల్స్ ఉన్నారు. మావోయిస్టు సిద్ధాంతాల భావ జాలం, స్థానిక గిరిజనలపై జరిగిన దురాగతాలపై విసిగిపోయి లొంగిపోతున్నట్టు వీరంతా ప్రకటించారని సుక్మా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ చవాన్ తెలిపారు. మారుమూల గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు- రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రివార్డులను అందచేస్తామన్నారు. అజ్ఞాతంలో ఉన్న నక్సల్స్ సాధ్యమైనంత త్వరగా లొంగిపోవాలని, జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం నాడు మరోసారి పిలుపునిచ్చారు. 2026 మార్చి 31 కల్లా నక్సల్స్ బెడద నుంచి దేశానికి విముక్తి కలిగించాలనే కృతనిశ్చయంతో కేంద్రం ఉందని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలో 22 మంది మావోయిస్టులను కోబ్రా కమెండోలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేశారని, వారి నుంచి అధునాతన ఆయుధాలు, పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నారని అమిత్‌షా తెలిపారు. 11 మంది మావోయిస్టులు కూడా సుక్మా జిల్లా బడేసేటీ-పంచాయతీలో లొంగిపోయారని, దీంతో నక్సల్స్ బెడద నుంచి ఆ పంచాయతీకి విముక్తి లభించిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# మజ్లిస్ పార్టీ ఉచ్చులో కాంగ్రెస్, బిఆర్ఎస్

**మొదటిపేజీ తరువాయి..**

వ్యతిరేకంగా జాతీయ వాద భావనతో బీజేపీ పోటీ-చేస్తోందని వివరించారు. మజ్లిస్ పార్టీ,రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమకారుల వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తోందని గుర్తు చేశారు. మజ్లిస్ పాత బస్తీకే మాత్రమే పరిమితం కాలేదని.. ఆ పార్టీ ప్రస్తుతం తెలంగాణలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాప కింద నీరులా విస్తరిస్తోందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీకి విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఒకే తానుముక్కలుగా కలిసి పని చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలు చైతన్యంగా ఆలోచించక పోతే,మళ్లీ రజాకార్ల పాలన లాంటి పరిస్థితులు దాపురించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మజ్లిస్ పార్టీ నాయకులు.. పాత బస్తీలోని హిందువుల ఇళ్లను స్వాధీనం చేసుకుని ప్రజలను ఖాళీ చేయించిన ఘటనలు చాలానే ఉన్నాయన్నారు. తెలంగాణను, హైదరాబాద్‌ను బలి చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వెనుకాడడం లేదన్నారు. ప్రజలను జాగృతం చేయాలనే పవిత్ర ఉద్దేశంతోనే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తోందని చెప్పారు. మాకు గెలుపు ఒక్కటే ముఖ్యం కాదని.. హైదరాబాద్‌ను రక్షించడం కూడా ప్రధాన లక్ష్యమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మజ్లిస్ పార్టీ మతోన్మాదం, గూండాయిజాన్ని ఎదుర్కొంటూ బీజేపీ ధర్మయుద్ధం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో హైటెక్ సిటీలో రంగులు వేసి అభివృద్ధి అంటూ ప్రచారం చేశారు. కానీ అభివృద్ధి పేరు చెప్పి ఎక్కడైతే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువ ఉందో అక్కడే పనులు జరిగాయని ఆరోపించారు. ఇరుకైన రోడ్లు సైతం నిర్మించారన్నారు. జీహెచ్ఎంసీ స్థితి దారుణంగా మారిందని.. వీధిలైట్లు కొనడానికి డబ్బుల్లేని స్థితికి దిగజారి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరు అసమ-ర్థంగా ఉందని.. పౌర సేవల మెరుగుదలకు నిధులు సైతం పెరగడం లేదన్నారు. మజ్లిస్ పార్టీ నుంచి నగరాన్ని రక్షించాలంటే.. చైతన్యంతో ఓటు- వేయాలని ప్రజలకు ఆయన సూచించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు విదేశీ పెట్టుబడుల గురించి చెబుతున్నారు. కానీ అవి ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక, పన్నుల సంస్కరణలు ఉగ్రవాదం, మతోన్మాదాన్ని అరికట్టడంతోపాటు సమర్థవంతమైన విదేశాంగ విధానం.. ఇలా అన్నింటిలో ప్రగతి కనిపిస్తోందని చెప్పారు. గతంలో విద్యుత్ కోసం రైతులు మోటార్ల దగ్గర నిద్రించాల్సి వచ్చేదని..మోదీ పాలనలో విద్యుత్ కోతల్లేని దేశంగా మారిందన్నారు. సనత్ నగర్,మల్కాజ్‌గిరి, దిల్‌స-ుఖ్‌నగర్, గౌలిపుర, చార్మినార్,నాంపల్లి, సోమాజిగూడ, ఖైరతాబాద్,కూకట్ పల్లి తదితర ప్రాంతాల్లో ప్రజల సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గౌతం రావు గారిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త ఐకమత్యంగా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మజ్లిస్ పార్టీ ఇప్పుడేం ఓల్డ్ సిటీకి మాత్రమే పరిమితం కాలేదని, తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తూ కుట్రలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు.

## భూభారతితో సమస్యలకు చెక్

**మొదటిపేజీ తరువాయి..**

మండలాన్ని ఎంచుకున్నట్లు- తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సాదా బైనామాద్వారా రైతులు పెట్టుకున్న దరఖాస్తులు రాష్ట్ర వ్యాప్తంగా 9 లక్షల 24 వేలు ఆన్‌లైన్ లో ఉన్నాయని, అన్నింటికీ భూ భారతిలో అవకాశం కల్పించి రైతులకు న్యాయం జరిగేవిధంగా కృషి చేస్తామన్నారు. పేదల ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా భూ భారతి చట్టం రూపొందించి, చట్టం చేసిన 90 రోజుల్లోనే విధి, విధానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూ భారతి పోర్టల్‌లో రైతు సమస్యలపై దరఖాస్తు చేస్తే ముందుగా తహశీల్దార్ పరిధిలో ఉంటుందని, తహశీల్దార్ చేయకపోతే ఆర్డిఓ, అదనపు కలెక్టర్ సరిచేయాలని, కలెక్టర్ చొరవ తీసుకుని పరిష్కారం చూపాలని అన్నారు. ఉమ్మడి జిల్లాకు ఒక సిసిఎల్ఏ, ట్రిబ్యునల్ ఏర్పాటు చేయనున్నట్లు- అందులో సమస్యలకు పరిష్కారం అయ్యే విధంగా ఉంటుందని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం కాకపోతే హైదరాబాద్‌లోని రెవెన్యూ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అధికారులు నిబద్ధతలో పనిచేయాలని, గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు- చేసి స్వయంగా కలెక్టర్లు వెళ్లి రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గత బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు చెప్పిన మాట వినలేదని విఆర్వో, విఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి, 23 వేల మంది ఉద్యోగులను రోడ్డు పాలు చేసారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఒక అధికారి ఉండాలనే ఉద్దేశంతో తిరిగి గ్రామపాలనాధికారుల వ్యవస్థ తీసుకురావడం జరిగిందన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలు పరిష్కంచేందుకు కృషి చేస్తారన్నారు. ధరణి చట్టం చేసిన తర్వాత రెవెన్యూ సదస్సులు ఎందుకు పెట్టలేదని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. సదస్సులు పెడితే ధరణి బాధితులు మీ వీపులు పగలకొట్టేవారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి పొంగులేటి వ్యాఖ్యానించారు. నోరు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సాగు చేసుకుంటున్న రైతుల పేర్లకు బదులు, పింక్ షర్ట్ వేసుకున్న వాళ్లకు పట్టా పాసు పుస్తకాలు ఇచ్చింది గత కేసీఆర్ సర్కార్ అని ఆయన ఆరోపించారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రైతులు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలకు అక్కడున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు. ధరణి పార్ట్ బీలో 18 లక్షల ఎకరాల భూములు ఉన్నాయని, పేదల ఆరున్నర లక్షల ఎకరాల భూమి అందులోనే ఉందని చెప్పారు. ఆ పేదల భూ సమస్యకు భూభారతి పరిష్కారం చూపుతుందని ఆయన హామీ ఇచ్చారు. భూముల మ్యాప్‌లు ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని, భూముల కొలతలకు, 6 వేల మంది సర్వేయర్లను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. భూభారతి చట్టానికి విధివిధానాలు ఖరారు చేశామని, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజల అభిప్రాయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కళ్లముందుంచుకుని పనిచేస్తుందని స్పష్టం చేశారు. పేదలకు నిత్యం తోడుగా నిలబడే సంకల్పంతోనే ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని ఆమె తెలిపారు. పేదింటి బిడ్డలకు సన్నబియ్యం అందిస్తే.. ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు అసహనంతో రెచ్చిపోతున్నారని ఆమె మండిపడ్డారు. పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చూసి వారు ఓర్వలేకపోతున్నారని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలపై అన్యాయం చేసిందని, ముఖ్యంగా భూ వ్యవహారాల్లో పేదలపై వివక్ష చూపిందని ఆమె ఆరోపించారు. భూములపై జరిగే అక్రమాలను అరికట్టేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని, గతంలో 'ధరణి' పేరిట ప్రజలను మోసం చేశారని ఆమె వ్యాఖ్యానించారు. మేము తెచ్చిన కొత్త చట్టం ద్వారా భూములు అర్హులైన వారికే చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇది ఒక మంచి లక్ష్యంతో రూపొందించిన చట్టం అని సీతక్క వివరించారు. ఇల్లు లేని వారికి గృహ నిర్మాణం కల్పించాలన్నదే ప్రభుత్వం ముందున్న ముఖ్యమైన లక్ష్యమని, ప్రతి పేద కుటు-ంబం కుండపోత వర్షాల్లోనూ సురక్షితంగా ఉండేలా ఒక గుడిసె అయినా ఉండాలని అనుకుంటున్నామని మంత్రి సీతక్క తెలిపారు. గత ప్రభుత్వంలో వీఆర్వోలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, చివరికి వారినే నిందించారని మంత్రి ఆరోపించారు. ఇప్పుడు కొత్త చట్టం అమలులో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.రెవెన్యూ అధికారులు, రైతులకు భూ భారతి అమలు తీరు, విధి విధానాలపై అవగాహన కల్పించారు.

# దళిత విద్యార్థులు వివక్షకు గురికావద్దు

**మొదటిపేజీ తరువాయి..**

బలహీన వర్గాలు కుల వివక్షను ఎదుర్కొంటున్నాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దళిత విద్యార్థులెవరూ అటువంటి వివక్షను ఎదు-ర్కోకుండా ఉండాలంటే 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించాలని.. రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు సూచించారు. ఈ మేరకు కర్ణాటక సీఎంకు రాహుల్ గాంధీ లేఖ రాశారు. నేటికి కూడా మన విద్యావ్యవస్థలో దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం సిగ్గుచేటు. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేద్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలి. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఇకనైనా ఈ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారు. వేముల రోహిత్ 2016లో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఆత్మహత్యకు యూనివర్సిటీ అధికారులు, ఇతర విద్యార్థి సంఘాలే కారణమనే ఆందోళనలు సాగాయి. దేశవ్యాప్తంగా అనేక రాజకీయపార్టీలు స్పందించాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రెండుసార్లు హైదరాబాద్‌కు వచ్చి వెళ్లారు. పోలీసులు దర్యాప్తు చేసి 2023 నవంబరులో తుది నివేదిక రూపొందించారు. గతేడాది మార్చి 21న దర్యాప్తు అధికారి ఆ నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. అతని ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. అలాగే అతను ఎస్సీ అనేందుకు ఎటువంటి ఆధారాలు కూడా లేవని, బీసీ వడ్డెర కులానికి చెందినవాడని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పలు పిటిషన్లలో విచారణను ముగించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ఈ కేసుపై పునఃదర్యాప్తు కొనసాగించాలని ఆదేశించింది. పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో రాహుల్ కర్నాటక సిఎం సిద్దరామయ్యకు లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేద్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవడానికి సిద్ధరామయ్య కృషి చేస్తారని తాను నమ్ముతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారని.. ఇకనైనా ఇటువంటి హత్యలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ అన్నారు.

## మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు!

**మొన్న కొమరంభీం జిల్లా, నేడు మంచిర్యాల జిల్లా..**



**నీలగిరి వార్త - ఆదిలాబాద్ ప్రతినిధి :** మంచిర్యాల జిల్లా కోటపల్లిమండలంలోని పలు గ్రామాల్లో మావోయి స్టులను వ్యతిరేకిస్తూ వాల్‌పోస్టర్లు వెలిశాయి. మండలంలోని పంగిడి సోమారం, నక్కలపల్లీ, వెంచర్లపల్లిల్లో ఈ పోస్టర్లు శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చాయి. వెంకటాపురం, వాజీడు ప్రాంతాల్లో ఈ నెల 8వ తేదీతో కార్యదర్శి శాంత పేరిట కర్రె గుట్టల పైకి రావద్దు, వస్తే బాంబులు పేల్చి చంపేస్తాం అంటూ పోస్టర్లలో పేర్కొన్నారు. వీటికి ప్రతిస్పందనగా ఆదివాసీ యువజన సంఘం పేరిట మావోయిస్టులారా ఇదేనా మీ సిద్ధాంతం ? ఇందుకోసమేనా మీ పోరాటం? అంటూ మరో పోస్టర్లు వెలుగులోకి వచ్చాయి. మొన్న కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నేడు మంచిర్యాల జిల్లాలో ఈ వాల్‌పోస్టర్లు ఇప్పుడు కలవరానికి గురిచేస్తున్నాయి. కాగా, మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లపై పోలీసులు స్పందించారు. ఆయా ప్రాంతాల్లో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పర్యటించి పరిస్థితులను పర్యవేక్షించారు. అనంతరం చెన్నూర్ పీఎస్‌లో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకే గుర్తు తెలియని యువకులు వాల్ పోస్టర్లు వేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి లేదని, వారి ప్రాబల్యం తగ్గిందని పేర్కొన్నారు. గ్రామాల్లో మావోయిస్టుల గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వాల్ పోస్టర్లపై సమగ్ర దర్యాప్తు చేపడతామని తెలిపారు.

## రేవంత్‌రెడ్డిపై విచారణ చేపట్టాలి

**మొదటిపేజీ తరువాయి..**

కెటిఆర్. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటి కాదని, కుమ్మక్కు రాజకీయాలు చేయడం లేదని నిరూపించు కోవాలన్నారు.రేవంత్ సర్కార్ కుంభకోణాలపై ప్రధాని మాట్లాడరేంమోడీకి చిత్తశుద్ధి ఉంటే కంచ భూములపై విచారణ జరిపించాలి ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాల్లో ఒకటైన న్యాయ వ్యవస్థ దేశంలో జరుగుతున్న పరిణామాలన్నింటినీ గమనిస్తూనే ఉన్నది. సరైన సమయంలో, సరైన పద్ధతుల్లో స్పందిస్తుంది.

## రేవంత్ సర్కార్ ఉంటుందో ఊడుతుందో!

**మొదటిపేజీ తరువాయి..**

16 నెలలుగా రాష్ట్రంలోని అన్ని వర్గాలతో ఛీత్కరింపులకు గురవుతున్నదని ఆరోపించారు. మంత్రివర్గ విస్తరణ తర్వాత రాష్ట్రంలో ముఖ్యమంత్రి మారుడో... ప్రభుత్వం కూలుడో తప్పక జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని నాలుగున్నర కోట్ల సబ్బండ వర్గాల ప్రజల ఆకాంక్షకు మేరకు పురుడుపోసుకున్న గులాబీజెండా, కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని తెలిపారు. పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 27న హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి గులాబీ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు, తెలంగాణవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి సర్కార్ అనతి కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని, రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు పెడితే అబాసుపాలవుతామన్న భావనతోనే ప్రభుత్వం సాహసం చేయడంలేదని మండిపడ్డారు. ఉద్యమ రథసారథి కేసీఆర్ తలపెట్టిన రజతోత్సవ సభలో ఏం అద్భుతాలు జరుగుతాయో.., గులాబీ బాస్ ఏం ప్రసంగిస్తాడోనని ప్రపంచమంతా ఎల్కతుర్తి సభ వైపే ఉరకలేత్తే ఉత్సాహంతో ఎదురు చూస్తున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పలువురు పాల్గొన్నారు.

## విశ్వ మానవాళికి గీతోపదేశమే!

**మొదటిపేజీ తరువాయి..**

యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడం.. మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి శతాబ్దాలుగా మన నాగరికత, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధరంగంలో సోదరులు, గురువులు, బంధు జనులందరినీ చూసి ధనుర్బాణాలు విడిచి చతికిల పడిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ- భగవద్గీత. ఇందులో 18 అధ్యాయాలు ఉన్నాయి. మనుషులు ప్రవర్తించవలసిన తీరు, పారలౌకికాన్ని పొందే విధానం రెండింటినీ శ్రీకృష్ణుడు బోధించాడు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన క్షణంగా అభివర్ణించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడూ గర్వించదగ్గ క్షణం. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## హెచ్‌సీయు భూములపై మరో దావా!

**మొదటిపేజీ తరువాయి..**

వినియోగించడాన్ని అడ్డుకునేలా కోర్టు జోక్యం అవసరమని, భవిష్యత్ తరాల కోసం ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందని బీ ద చేంజ్ సంస్థ వాదించింది. ఈ పిటిషన్‌లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, యుజీసీ హెచ్ సీయు యాజమాన్యాన్ని ప్రతివాదులుగా చేర్చారు. యూనివర్శిటీ అభివృద్ధి విద్య, పరిశోధన పరంగా ఉండాలని, కాకపోతే ప్రకృతి నాశనం చేసి నిర్మాణాల పేరుతో మౌలిక వసతుల అభివృద్ధి జరగకూడదని స్పష్టం చేశారు.పర్యావరణ ఉద్యమకారులు విద్యార్థి సంఘాలు, పౌరసంఘాలు ఈ పిటిషన్ కు మద్దతు తెల్పుతున్నాయి. ప్రగతికి పర్యావరణ పరిరక్షణ అనేది విరుద్ధం కాదు, రెండూ పరస్పరంగా సమతుల్యంగా ఉండాలి అని రామ్ కల్యాణ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

## రూ.10,500కోట్లు!

**మొదటిపేజీ తరువాయి..**

నెట్ వర్క్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం హైదరాబాద్‌లో నిర్మించబోయే ఈ సదుపాయం 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్. 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది. దేశంలో తెలంగాణను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్వమిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంబిస్తారు. ఈ ప్రాజెక్టును అత్యున్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది. ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యూఎస్, ఎన్‌టీటీ-, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీ ఆర్‌ఎల్‌ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్ గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందన్నారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUB-LICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

NEELAGIRI VARTHA TELUGU DAILY
neelagirivartha@gmail.com

# నీలగిరి వార్త

తెలుగు దిన పత్రిక
మన కోసం మన వార్త
తెలంగాణ ఉమ్మడి జిల్లాలు
శనివారం
19-4-2025




## రాష్ట్ర ధార్మిక సలహాదారుని మర్యాద పూర్వకంగా కలిసిన డాక్టర్ ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్



ఉప్పల్ నీలగిరి వార్త

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన ధార్మిక సలహాదారు ఆర్ గోవింద్ హరి ని ఎండోమెంట్స్ కమీషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భగా వారిని అభినందించి , రాష్ట్రంలో ఉన్న దేవాలయాల స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత ప్రసాద పథకం అమలు తీరుతెన్నులను వారితో చర్చించడం జరిగింది అని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ అన్నారు . సరియైన వ్యక్తికి సరైన సమయంలో ప్రభుత్వంలో ధార్మిక స్థానం కలగటం ఆనందించ దగ్గ విషయం కొనియాడారు .

## మార్కాపురంలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ

మార్కాపురం, ఏప్రిల్ 18,నీలగిరి వార్త ప్రతినిధి :



ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణం లో శుక్రవారం వక్ఫ్ సవరణ చట్టం 2025 బిల్లుకు వ్యతిరేకంగా జే ఏ సి కన్వీనర్ షేక్ అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో ముస్లిం సంఘాలు,, లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు, భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్బంగా జే ఏ సి కన్వీనర్ షేక్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ వక్ఫ్ అనగా ఇస్లాం మతంలో, ధార్మిక ప్రయోజనాల కోసం అంకితం చేయబడిన ఆస్తి అని ఇది ఆస్తి యజమాని నుంచి దైవానికి (అల్లాహ్) అంకితం చేయబడుతుంది, ఆ ఆస్తిని మతపరమైన లేదా దాతృత్వ కార్యక్రమాలకు ఉపయోగించవచ్చు అన్నారు. ఇది స్థిరాస్తి లేదా చరాస్తి ఏదైనా కావచ్చు.వక్ఫ్ ఆస్తులను వక్ఫ్ బోర్డులు నిర్వహిస్తాయి, ప్రతి రాష్ట్రంలో వక్ఫ్ బోర్డ్ ఉంటుంది.భారతదేశంలో సుమారు 10 లక్షల ఎకరాల ఆస్తులు వక్ఫ్ బోర్డుల నియంత్రణ లో ఉన్నాయి.వక్ఫ్ ఆస్తులను అమ్మడం లేదా వెరె వ్యక్తికి బదిలి చెయడం సాధ్యం కాదని సవరణ చట్టం ద్వారా మాకు అన్యాయం జరుగుతుందని తెలిపారు.తరువాత కంభం సెంటర్ లోని ముస్లిం షాదీఖానా నుంచి పట్టణం లోని ప్రధాన రహదారులగుండా వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది.ఈ కార్యక్రమం లో సంఘీభావం తెలుపుతూ కమ్యూనిస్టు సంఘ నాయకులు, బిసి ఎస్సి ఎస్టీ మైనారిటీస్ సంఘ నాయకులు, ముస్లింసోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు జాతి వృషభ రాజుల ప్రదర్శన

మార్కాపురం, ఏప్రిల్ 18,నీలగిరివార్త ప్రతినిధి:



మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని ఎస్ పి కే పి కళాశాల మైదానంలో నిర్వహించు చున్న ఆలిండియా ఒంగోలు జాతి వృషభ రాజుల ప్రదర్శన పోటీలను శుక్రవారం ప్రారంభించారు.తొలిరోజు 6 పండ్ల విభా గంలో పోటీలను నిర్వహిస్తున్నారు.ఈ సం దర్భంగా శాసనసభ్యులు కందుల నారాయణ ఒడ్డి మాట్లాడుతూ మూడు రోజులుపాటు ఈ పోటీలు కొనసాగుతాయని రైతులు అత్యంత ఇష్టంగా ఈ క్రీడలను తిలకిస్తారని వారి కోసమే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు కార్యక్రమంలో మార్కాపురం ఫోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇన్చార్జ్ కందుల రామిరెడ్డి , జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ , బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ పివి కృష్ణారావు , ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం, రోడ్లు జలమయం, సిటీ జనులకు అలర్ట్!

**శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలోచాలాప్రాంతాల్లో భారీ వర్షం**

**లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం**

**ప్రజలు,వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు**

**ఈదురుగాలుల తీవ్రతతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్!**



(ప్రత్యేకప్రతినిధి నీలగిరివార్త)

హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిపోయిన నగరవాసులకు సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మరోవైపు, ఈదురుగాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, నాంపల్లి, హిమాయత్ నగర్, ముషీరాబాద్, విద్యానగర్,
రామ్ నగర్, ఖైరతాబాద్, మియాపూర్ దిల్‌సుఖ్‌నగర్‌లో ఒక్కసారిగా ఈదురు గాలులలో వాన కురిసింది. దీంతో పలు చోట్ల చెట్లు విరిగిపడిపోయాయి. గాలుల ఉధృతి తీవ్రంగా ఉండటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.కుత్బుల్లాపూర్, దుండిగల్, సుచిత్ర, కొంపల్లి, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లోనూ ఈదురుగాలులతో మోస్తరు వర్షం పడుతోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియా పరిధిలో ముందు ఈదురుగాలులు భయంకరమైన వాతావరణం సృష్టించాయి.తరువాత భారీ వర్షం కురిసింది. అమీర్‌పేట్, పంజాగుట్ట, మధుర నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పరిసరాల ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది.కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, మెహదీపట్నం, మాసబ్ ట్యాంక్, కార్వాన్, ఎల్బీనగర్, వనస్థలిపురం, భాగ్యలతా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్‌ప్రాంతంలోనూ వర్షం పడుతోంది. ఈదురుగాలులు వీస్తుండటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

**మరో మూడు గంటలపాటు హైదరాబాద్‌లో వర్షం**

హైదరాబాద్ నగరంలోని చాలా ప్రాంతాల్లో మరో మూడు గంటలపాటు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. ప్రజలు అవసరమైతే తప్ప బయటికి రావొద్దని తెలిపింది. బోయిన్ పల్లి,తిరుమలగిరి,అల్వాల్, ప్యాట్నీ, పారడైస్ చిలకలగూడ, చాదర్‌ఘాట్, ఆజంపురాలో ఈదురు గాలుల తీవ్రతకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు, కోకాపేటలో ఈదురుగాలుల బీభత్సానికి నిర్మాణ సామాగ్రి గాల్లో ఎగురుతూ కనిపించాయి. హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో రాత్రి 9 గంటల వరకు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## చట్టవిరుద్ధంగా ' క్రీడా మైదానంలో అక్రమ కట్టడాలకు శ్రీకారం..?

**" కలెక్షన్ " కోసం..క్రీడ మైదానం పై కన్నేర చేస్తే ఎలా..?**

**గతంలో మహిళల పై అగత్యాలు,ఆపై మర్డర్ జరిగిన ప్రదేశంలో ' రక్షణ ఎలా ' ..?**

**నిర్మానుషా ప్రాంతంలో " బాలికలకు " వసతి గృహం నిర్మాణాల..?**

**రేపు ఎల్లుండి ' ఆరిపోయే దీపానికి '..ఇంత ఆశ ఉంటే ఎలా..?**

**" ఖద్దర్ నేతల " అక్రమ కట్టడాలకు..కాకీలతో రాజకీయమా..?**

**అక్రమ కట్టడాలను ఆపలేని స్థానిక " ఎమ్మెల్యే " కు పదవెందుకు దండగ..?**

**మూగబోయిన " విద్యార్థి సంఘాల " గొంతుక..?**

**చోద్యం చూస్తున్న " విద్యా కమిటీ " సభ్యులు..?**

**ప్రభుత్వ భూములు అన్ని ఉండగా..?ఇదేం రాజకీయం..?కలెక్షన్ బాబులు..?**

**కలెక్షన్ బాబులు అక్రమాలను చూడలేక కళ్ళు మూసుకున్న కామ్రేడ్లు..?**

బ్యూరో ఇంచార్జీ (కంచర్ల నాగేశ్వరరావు గౌడ్) : నీలగిరి వార్త

ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఉల్లాసానికి,శారీరక ధృడత్వానికి అలాగే యువతలో దాగున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయి.అలాంటి క్రీడా మైదానంలో అక్రమ కట్టడాలు నిర్మించడం అక్రమమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడ మైదానాల బోర్డుకు తెలియదా..?క్రీడా మైదానంలో సాధారణంగా విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, సీనియర్ సిటిజనులకు,మహిళలకు,మానసిక రోగులకు, క్రీడాకారులకు, డాక్టర్లకు, లాయర్లకు, పోలీసులకు మొదలగు వారు క్రీడలు ఆడటానికి మరియు వ్యాయామం చేయడానికి కేటాయించబడిన ఏకైక వేదిక ఎర్రగొండపాలెం ఉన్నత పాఠశాల క్రీడామైదానం.అలాంటిది ఈ క్రీడా మైదానంలో అక్రమంగా కట్టడాలు నిర్మించడం వల్ల క్రీడలు ఆడటానికి మరియు వ్యాయామం చేయడానికి ఇప్పటికే " కంచె చేను మేసినట్లుగా " కొందరు అజ్ఞాత వ్యక్తులు వారి స్వార్థ ప్రయోజనాలకు ఏకంగా క్రీడా మైదానన్నే యద్దేచ్ఛగా కబ్జా చేస్తే ఆనాటి ప్రభుత్వ అధికారులు " చెనక్కాయలు తిన్నామా..?చెయ్యి కడిగామా " ..?అన్నే రీతిలో కపట నిద్ర ప్రదర్శనతో నాటికే యర్రగొండపాలెం క్రీడ మైదానం సగం కబ్జాకు గురైంది.కాలక్రమేనా మిగిలిన సగం క్రీడా మైదానంలో గత పాలకుల పుణ్యమానా..? నూతన తరగతుల భవన నిర్మాణాలని,వంట గదులని, మల్లమూత్ర విసర్జనశాల గదులన్ని, క్రీడల ఆడిటోరియం భవన నిర్మాణాలతో నేటికీ ఎర్రగొండపాలెం ప్రభుత్వ హైస్కూల్ క్రీడమ్ మైదానం " ముసిలోడి మూతి వలె " కుంచించక పోయింది.అందులోనూ కలెక్షన్ బాబులు కాసులకు కక్కుర్తి పడి, అనధికారికంగా,చట్ట విరుద్ధంగా యదేచ్ఛగా ఎర్రగొండపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గల " ఆవగింజంత " క్రీడా మైదానంలో కూడా విద్యార్థినిల వసతి గృహాల నిర్మాణాల పేరుతో దోపిడి చేస్తుంటే..? ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు..? " నీటి మీద రాతల వలె " అడపదడప సంబంధిత అధికారులకు అర్జీలను సమర్పిస్తూ,మేము కూడా విరోచితంగా పోరాడుతున్నామని సమాజంలో కనిపించడానికి కఠోరంగానే శ్రమిస్తుండటం బాధాకరం.ఇకపోతే ఇలాంటి చట్ట విరుద్ధమైన అక్రమ కట్టడాల పై,అధికార ఖద్దరు నేతల ఆక్రమాల పై కన్నెర చేయాల్సిన కామ్రేడ్లు భయంతో కార్యాలయాలకే పరిమితం కావడం శోచనీయం.చివరికి విద్యార్థుల హక్కుల రక్షణకై అహర్నిశలు శ్రమించే విద్యార్థి సంఘాల నేతల అడ్రస్సులు కూడా " మచ్చుతునకైనా " కనిపించకపోవడం




సిగ్గుచేటుగా భావించవచ్చు అంటూ సామాజిక,రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నేటి కలెక్షన్ బాబుల అవినీతి పాపాలకు.. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఆటంకం కలిగించకుండా తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఎర్రగొండపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానం రక్షణ,అభివృద్ధి కమిటీ స్పష్టం చేయడం జరిగింది.

**కొసమెరుపు :-**

రానున్న రోజుల్లో నేటి అధికార ఖద్దర్ పాలకులు కొందరు..అవినీతి దాహంతో అడ్డు అదుపు లేకుండా ఇలాంటి అజ్ఞానంతో కూడిన నిర్ణయాలు తీసుకొని రానున్న రోజుల్లో ప్రజలకు దూరంగా అడ్రస్సు లేకుండా ఉండడం కంటే తక్షణమే " అంతఃకరణ శుద్ధి " తో విలువలతో కూడిన నిర్ణయాలు తీసుకొని ప్రజాక్షేత్రంలో సాటిలేని నేటి రాజకీయ నేతల సరసన అగ్రస్థానం సంపాదించుకోవాలంటూ ఆశీస్తూ ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం రక్షణ,అభివృద్ధి కమిటీ కోరడమైనది.

## 29న హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద పెన్షనర్ల రాష్ట్రస్థాయి ధర్నా

**టాప్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి నాగేశ్వర్రావు,**

**గతంలోకలక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలతో ప్రయోజనం లేకనే!**

**ఆరోగ్యకార్డులుపనిచేయకవృద్ధాప్యంలో పెన్షనర్లు అనేక ఇబ్బందులు**

ప్రత్యేకప్రతినిధి నీలగిరివార్త

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్ల అసోసియేషన్ (టాప్ర) ఆధ్వర్యంలో ఈనెల 29న హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద రాష్ట్రస్థాయి ధర్నాకు చేపట్టనున్నట్టు పిలుపునిచ్చింది.
ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అందుబాటులో లేనందున ఓఎస్డీకి టాప్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి నాగేశ్వర్రావు, ఉపాధ్యక్షులు నరహరి,



కార్యదర్శి కృష్ణారావు కలిసి నోటీసును అందజేశారు. అనంతరం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి గతేడాది అక్టోబర్ లో మూడు దశల పోరాటానికి సిద్ధమయ్యామని తెలిపారు. అందులో భాగంగా నవంబర్ ఐదు,ఆరు తేదీల్లో పెన్షన్ పేమెంట్ కార్యాలయాల ముందు, అదేనెల 19న జిల్లా కలక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలను నిర్వహించి ప్రభుత్వానికి మెమొరాండం సమర్పించామని గుర్తు చేశారు. ఉద్యోగ జేఏసీ ప్రాతినిధ్యం మేరకు ప్రభుత్వం ఒక డీఏను మంజూరు చేసిందని తెలిపారు. కనీసం రెండు డీఏలను ప్రభుత్వం ప్రకటిస్తుందని పెన్షనర్లు ఆశించారని పేర్కొన్నారు. కానీ ఒక డీఏ మాత్రమే ఇచ్చి రెండోది మార్చి చివరి వరకు ఇచ్చే ప్రయత్నం చేస్తామంటూ పభుత్వం నుంచి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని కూడా దృష్టిలో ఉంచుకుని మూడోదశ పోరాటాన్ని వాయిదా వేశామని పేర్కొన్నారు.కానీ ఏప్రిల్ గడిచిపోతున్నా ఇవ్వాల్సిన ఐదు డీఏలు, వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) నివేదికను తెప్పించుకుని అమలు చేసే ప్రయత్నం ప్రభుత్వం చేయడం లేదని తెలిపారు. ఆరోగ్య కార్డులు పనిచేయక పోవడంవల్ల వృద్ధాప్యంలో పెన్షనర్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అప్పు చేసి ఖర్చు పెట్టుకుని మెడికల్ రీయింబర్స్మెంట్ కోసం దరఖాస్తు చేస్తే ఏండ్ల తరబడి బిల్లులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.గత ఏడాది మార్చి తర్వాత ఉద్యోగ విరమణ పొందిన వారికి పెన్షన్ నిధులు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 20 ఏండ్ల సర్వీసుకు పూర్తి పెన్షన్ ను మంజూరు చేస్తూ ఉత్తర్వులివ్వాలని పేర్కొన్నారు. రూ.398 వేతనంతో పనిచేసిన సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి పెన్షన్ కు వర్తింపజేయాలని సూచించారు.

## హైదరాబాద్ నగరంలో బ్రతకాలంటే ఆ ఖర్చు భరించాల్సిందే!

**భారీగా పెరుగుతున్న కాస్ట్ ఆఫ్ లివింగ్!**

**మిగతా చోట్ల కంటే భాగ్యనగరంలో లో అన్ని ధరలు భారీగానే!**

**సగటు మానవుడు జీవించాలంటే కనీసం రూ. 50వేల ఆదాయం**

**ఇన్ఫో మెన్స్ ఆన్లైన్ వీరీడియా స్టార్ టాప్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్ సర్వే!**

**ముంబై మొదటి స్థానం,జైపూర్ చివర,హైదరాబాద్ 6 వ స్థానంలో!**

చెన్నూరి అన్వేషి (ప్రత్యేకప్రతినిధి నీలగిరివార్త)






ప్రాథమిక విద్య పూర్తి అయిన తర్వాత ఉన్నత విద్యా కోసం చాలామంది విద్యార్థులు పట్టణాలకు లేదా నగరాలకు వెళుతూ ఉంటారు. పట్టణాల్లో చదువు పూర్తి చేసుకున్న వారు ఉపాధి కోసం నగరాలకు వెళుతూ ఉంటారు. తెలంగాణలో ఏ మూలనో ఉన్నవారు సైతం హైదరాబాదులో జీవించాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు. ఎందుకంటే హైదరాబాదులో ఏదో ఒక పని చేసుకుంటూ ఉపాధి పొందవచ్చని. అలాగే డబ్బుబాగాసంపాదించొచ్చని భావిస్తుంటారు.
అయితే ప్రస్తుత కాలంలో జీతాలతో పాటు ఖర్చులు కూడా బాగానే పెరుగుతున్నాయి.ముఖ్యంగా ఇంటి అద్దె విషయంలో తడిసి మోపెడ అవుతుందని ఇక్కడకి వలస వచ్చిన వారు చెబుతున్నారు. వచ్చే జీతంలో సగంవరకు ఇంటి అద్దె చెల్లించడానికి సరిపోతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం అద్దె రేట్లు హైదరాబాదులో ఎలా ఉన్నాయో?పరిశీలిస్తే గుండె గాబరా కాక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు
ఇన్ఫో మెన్స్ ఆన్లైన్ వీరీడియా స్టార్ టాప్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్ సర్వే!
ఇటీవల ఇన్ఫో మెన్స్ ఆన్లైన్ వీరీడియా స్టార్ టాప్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్ ఓ సర్వే నిర్వహించింది. హైదరాబాదులో లివింగ్ కాస్ట్ ఎలా ఉంది? అనే దానిపై రీసెర్చ్ చేసి వివరాలను బయటపెట్టింది. ముంబై మొదటి స్థానం,జైపూర్ చివర,హైదరాబాద్ 6 వ స్థానంలో!
ఈ పరిశోధనలో భాగంగా మొత్తం దేశవ్యాప్తంగా 10 ప్రధాన నగరాలను ఎంచుకుంది. ఇందులో ముంబై రూము 35, 887 తో మొదటి స్థానంలో ఉండగా జైపూర్ 27,813 తో చివరి స్థానంలో నిలిచింది. హైదరాబాదు ఆరవ స్థానంలో నిలిచింది. హైదరాబాదులో జీవించాలంటే నెలకు కనీసం 30 నుంచి 50 వేల వరకు ఖర్చు అవుతుందని ఈ సంస్థ తెలిపింది. ఇందులో ప్రధానంగా అద్దె ఇంటికి రూ.8,000 చెల్లించాల్సిందే!
ఇది కూడా సింగిల్ రూమ్ మాత్రమే. కాస్త ఫ్లెక్సిబుల్ రూమ్ కావాలంటే కనీసం రూపం 15 వేల వరకు అవుతుంది. ఇక కిరాణా ఖర్చులు, రవాణా ఖర్చులు, నిత్యవసరాలు, అదనపు ఖర్చులు కలిపి మొత్తం 31,000 అవుతుందని ఈ సంస్థ తెలిపింది. ఇక పిల్లల స్కూల్ ఫీజులు తోపాటు వైద్య ఖర్చులు అదనంగా భరించాల్సి వస్తుంది.
ప్రస్తుతం సామాన్యులు వీటితోనే సతమతమవుతున్నారు. సినిమా లేదా ఇతర వ్యసనాలు ఉంటే మాత్రం ఈ ఖర్చుల్లో కొన్ని మాయం అవుతుంటాయి. ఎందుకంటే ఫ్యామిలీతో కలిసి సినిమాకు వెళ్లాలంటే కనీసం రూ.1500 వరకు అవుతుంది. సామాన్యులు నెలకు ఒక్కసారి సినిమాకు వెళ్లిన కనీసం రూ.2,000 వరకు చెల్లించాల్సిందే! ఇక పార్కులు లేదా ఫంక్షన్ల లాంటి కార్యక్రమాలకు మరింత ఖర్చు అయ్యే అవకాశం ఉంది. అయితే కొందరు వచ్చిన ఆదాయం సరిపోకపోవడంతో అదనంగా అప్పులు చేయాల్సి వస్తుంది.
ఇలా బ్యాంకు నుంచి కూడా రుణాలు తీసుకొని జీవితాన్ని గడుపుతున్నారు. అయితే మిగతా ప్రదేశాల్లో కంటే హైదరాబాదులో అన్ని ధరలు పెరిగిపోయాయి.
దీంతో సగటు మానవుడు ఇక్కడ జీవించాలంటే కనీసం రూ. 50వేల ఆదాయం వస్తూ ఉండాలి. కానీ చాలామందికి ఆ పరిస్థితి లేదు. ఒకవేళ అంత జీతం వచ్చినా అదనపు అనారోగ్యాలు వచ్చే అవకాశాలు ఉంటున్నాయి. అయితే ఖర్చులను తగ్గించుకొని ప్రయత్నం చేస్తేనే ఆదాయం సరిపోయే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అనుమతులు లేకుండా స్టెరాయిడ్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

శుక్రవారం ఉదయం మధ్యాహ్నం 12 గంటల సమయంలో %ూ. ఎఖుశ్రీ%, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మటువాడ కి మార్కండేయ కాలనీ, మంగలికుంట, డాక్టర్స్ కాలనీ-%××% కు చెందిన కందగట్ల శ్రావణ్ కుమార్ ఏ కిరణ్ అనే వ్యక్తి ఎటువంటి లైసెన్స్ లేకుండా స్టెరాయిడ్ లను అమ్ముతున్నాడనే సమాచారం మేరకు సదరు ఎస్పై గారు మరియు నార్కోటిక్స్ సిబ్బంది మటువాడ పోలీస్ స్టేషన్ కు సంబంధించిన సిబ్బంది కలిసి సదరు కిరణ్ ఇంటి వద్దకు వెళ్లి తనిఖీ చేయగా, అతని ఇంటిలో ప్రమాదకరమైన స్టెరాయిడ్స్ టాబ్లెట్స్ ఇంజక్షన్లు దొరికినవి. గతంలో సదరు కిరణ్ బాడీ బిల్డింగ్ కాంపిటీషన్ కోసమని కఠోర శ్రమ చేస్తున్న సమయంలోనే తొందరగా బాడీని శరీరకృతులను కండరాలను పెంచుకోవాలని సుబేదారి ఏరియాలో గల %జీణ% జిమ్లో ట్రైనింగ్ తీసుకుంటున్న సమయంలో ప్రశాంత్ అనే వ్యక్తి పరిచయం కావడం, అతను స్టెరాయిడ్స్ తీసుకుంటే కండరాలు బాగా వస్తాయి అని చెప్పి, లైసెన్స్ లేని స్టెరాయిడ్స్ ని సదరు కందగట్ల శ్రావణ్ కుమార్ కు కొన్ని ఇంజక్షన్లను అమ్మినాడు. అప్పటినుండి సదరు శ్రవణ్ కుమార్ ఇంజక్షన్ వేసుకొని జిమ్ చేస్తూ ఉండేవాడు. ఈ విధంగా గత ఐదు సంవత్సరముల నుండి స్టెరాయిడ్స్ తీసుకుంటూ, ఎటువంటి లైసెన్స్ లేకుండా అక్రమ పద్ధతిలో వైజాగ్ నకు చెందిన మణికంఠ, ఆనంద్ల వద్ద ఇట్టి ప్రమాదకరమైన స్టెరాయిడ్ లను ఆన్లైన్లో ఆర్డర్ చేసుకొని వీటిని సదరు శ్రావణ్ కుమార్ అమాయకమైన యువతను నమ్మించి వారికి కఠోర శ్రమ లేకుండా తొందరగా శరీరాకృతులను కండరాలను మెరుగుపరుచుకోవచ్చునని నమ్మించి, గత ఐదు సంవత్సరాల నుండి వాటిని యువతకు అమ్ముతూ అధిక మొత్తంలో డబ్బులు సంపాదిస్తున్నాడని ఒప్పుకోవడం జరిగింది. సదర్ శ్రావణ్ కుమార్ ఇట్టి ప్రమాదకరమైన స్టెరాయిడ్స్ టాబ్లెట్స్ మరియు ఇంజక్షన్లను యువతకు అమ్మడం వలన వారు వీటిని వాడినట్లయితే బీపీ పెరిగి హాట్ స్ట్రోక్ వచ్చే అవకాశం కూడా ఉంటుంది మరియు వీటిని వాడిన వారు కాలక్రమమైన మానసిక సమస్యలతో కూడా ఇబ్బందులు పడతారు, కాబట్టి ఈ ప్రమాదకరమైన స్టెరాయిడ్స్ లను స్వాదీనపరుచుకొని కేసు నమోదు చేయడం జరిగింది. ఇట్టి ప్రమాదకరమైన స్టెరాయిడ్స్ లను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సదరు కిరణ్ ను అరెస్టు చేసి రిమాండ్కు పంపించడం జరుగుతున్నది.

రీకవరి చేసిన ప్రాపర్టీ వివరాలు:-

1) ఉపయోగించిన స్టెరాయిడ్స్ టాబ్లెట్లు 937,
2) ఉపయోగించని స్టెరాయిడ్స్ టాబ్లెట్స్ 283,
3) ఉపయోగించిన స్టెరాయిడ్స్ చిన్న గాజు సీసాలు (%ఎఖుశ్రీం) 64,
%4) ఉపయోగించని స్టెరాయిడ్స్ చిన్న గాజు సీసాలు 11,
5) సగం ఉపయోగించిన స్టెరాయిడ్స్ చిన్న గాజు సీసాలు 3.

నిందితుల వివరములు:-

%ూ%-1. కందగట్ల శ్రావణ్ కుమార్ ఏ కిరణ్, తండ్రిపేరు: లక్ష్మయ్య, వయస్సు-34 సంవత్సరములు, కులం:పద్మశాలి, వృత్తి- జిమ్ ట్రైనర్, నివాసం: ఇంటినెంబర్: 22-8-276/10, మార్కండేయ కాలనీ, మంగలికుంట, డాక్టర్స్ కాలనీ-%××%, వరంగల్, ఆ ఆధార్ నెంబరు 7555 2497 9087, సెల్ నెంబర్: 809988055.
%ూ%-2. ప్రశాంత్,
%ూ%-3. మణికంఠ,
%ూ%-4. ఆనంద్.

# దేశంలో అతి తక్కువ ధరలకు ఆహారం ఎక్కడ లభించునో మీకు తెలుసా?: అంకేశ్రపు సాంబయ్య

నీలగిరి వార్త భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో

కొత్తగూడెంకు చెందిన విశ్రాంతి ఉద్యోగి అంకేశ్రపు సాంబయ్య ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాయతీ రాజ్ తన మిత్రుడు రిటైర్మెంట్ ఫంక్షన్ కు హాజరై తను భోజనం చేసిన తర్వాత ప్రక్కనే ఉన్న విస్తర్ల లో వదిలి వేసిన ఆహారం పదార్థాలు చూసి చాలా భావోద్రేకానికి లోనై మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేక నష్టాలతో వ్యవసాయ చేస్తుటారు, పండించిన పంటకు అకాల వర్షాల కారణంగా పంట నష్టం జరగడం పంట పండించి ధాన్యం రాశులుగా పోసిన టైం లో ఆకాల వర్షభావంతో ధాన్యం తడవడం, వర్షానికి కొట్టుక పోవడం వంటి బాధలు పడుతూ ఉంటారు. భారత దేశానికి రైతే రాజుగా, దేశానికే వెన్నుముకగా నిలుస్తూ తనవంతు బాధ్యతగా దేశానికి అన్నం పెడుతున్నాడని అన్నారు. దేశంలో అతి తక్కువ ధరలకు ఆహారం ఎక్కడ ఉంటుందో ఊహించగలరా అని ప్రశ్నించారు. మన పార్లమెంట్ క్యాంటీన్లో మాత్రమే చాలా తక్కువ ధరలకు ఆహార పదార్థాలు దొరుకుతయాని, అదే మనం త్రాగే కాపీ. టి. ఒక్క రూపాయి మాత్రమే, మనం తినే చపాతీ ఒక్క రూపాయి, మధ్యన్నా భోజనం కేవలం రూ.2లు, చికెన్ కర్రీ. రూ 24=50.పైసలు, చేప కర్రి. రూ.13లు, మాత్రమే బిర్యానీ కేవలం రూ.8లు ఇలా అన్ని రకాల ఆహారం రాష్ట్రాల వారిగా అందరికి అందుబాటులో ఉ ఒడే ప్రదేశం కేవలం మన పార్లమెంట్ లో ఎక్కడ లేని విధముగా అతి తక్కువ ధరలకే లభ్యమౌతాయి. కాగా పార్లమెంట్ సభ్యులకు జీతం సుమారుగా 1 లక్ష 20 వేలు నుండి రు 3.50లక్షల వరకు ఉంటుంది. వారు బ్రతికినంత కాలం ఎన్ని పదవులు పొందితే అన్ని రకాల పింఛన్లు పొందే అవకాశం ఈ పేదవారికి ఉంటుంది, ఆదాయపు పన్ను మినహాయింపు కూడా లభిస్తుంది. ఈ విషయం సమాచార హక్కు చట్టం ఫలితంగా పొందిన



దాని ప్రకారం వివరించారు అదే .

కనీసం 20 ఏళ్ల సర్వీసులో ఉండాల్సిన మిగిలిన ప్రభుత్వో ఉద్యోగులతో పోలిస్తే రాజకీయ నాయకులకు ఒక పదవీ కాలానికి జీవిత కాలపు పెన్షన్ ఇవ్వడం తీవ్ర అన్యాయం. దీంతో ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండి పడుతోంది. 20 ఏళ్లు లేదా అంత కంటే ఎక్కువ కాలం మిలిటరీలో సేవలందిస్తున్న వారికి, మన స్వేచ్ఛను కాపాడుతూ తమ ప్రాణాలను పణంగా పెట్టి తమ రిటైర్మెంట్ వేతనంలో కేవలం 50% మాత్రమే పొందుతున్నారు అదే సురక్షిత పరిమితుల్లో తమ రాజకీయ పదవులను కలిగి ఉన్న రాజకీయ నాయకులు, కేవలం 5 సంవత్సరాల పాటు పనిచేసిన తర్వాత పదవీ విరమణపై జీవితకాలం పెన్షన్లు పొందుతున్నారు ఇది ఎంతవరకు కరరెక్టు అని విచారం వ్యక్తం చేశారు అదే విధంగా మన పౌరులు కూడా విచిత్రమైన మనో భావాలతో ప్రవర్తిస్తున్నారు ఏదైనా ఫంక్షన్ కు వెళ్తే మనం తినే ఆహారం ఎంత కావాలో అంతే తినాలని, విస్తరిలో వదలివేసిన అన్నం చూడండి అదే మన ఇంట్లో అల చేస్తామా ఒక్కసారి ఆలోచించండని ఇస్తర్లలో వదిలేసినా ఆహారాన్ని చూపిస్తు ఆవేదనన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంకల్పించినా సన్న బియ్యం అందరికీ అందే విధముగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.ఖ

# శుభకార్యాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన రాజనాల శ్రీహరి





వరంగల్ సిటీ నీలగిరి వార్త.

శుక్రవారం రాజనాల శ్రీహరి నగరంలో పలు శుభకార్యాలలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. నాగవెల్లి శ్యాం కూతురు సారీ ఫంక్షన్ లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి. అనంతరం నాగవెల్లి సుమన్ నూతన గృహప్రవేశంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి.

# అగ్ర నేతల పేర్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ..

భద్రాచలం టౌన్ నీలగిరి వార్త

నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జ్ షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ ప్రెస్ మీట్ నిర్వహించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏఐసీసీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పొదెం వీరయ్య .

దేశంలో కులగణన అడ్డుకోవడానికే సోనియా, రాహుల్ పై అక్రమ కేసులు

రాహుల్‌ని చూసి ప్రధాని మోడీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భయపడుతున్నది

దేశవ్యాప్తంగా ఈవీ మిషన్లు కాదు, బ్యాలెట్ పేపర్ కావాలన్న ఏఐసీసీ ప్లీనరీ నిర్ణయానికి బిజెపి భయపడుతున్నది

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలే కాంగ్రెస్ ను గెలిపించుకుంటారు

దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబానికి దేశ ప్రజలు అండగా ఉన్నారు.

భారతదేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి అఖిలభారత కాంగ్రెస్ పార్టీ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

భారత దేశంలోని అన్ని మతాలను ఏకం చేస్తూ



నడవాలన్న కాంగ్రెస్ అభీష్టాన్ని తిరగరాస్తు ముస్లిం సోదరులకు అన్యాయం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును మొన్న పార్లమెంట్లో ప్రవేశపెట్టిన విషయమే దాన్ని తిరస్కరిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో తీర్మానం చేయడం పట్ల భయభ్రాంతులకు గురై కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు మీద కేసులు పెట్టడం జరుగుతుంది.

రేపటి నుంచి భద్రాచలం నియోజకవర్గం లో ఏఐసీసీ నిర్దేశించిన జై బాపు జై భీమ్ జై సమేధాన్ కార్యక్రమం, రేపు ఉదయం 9 గంటలకు భద్రాచలం పాత మార్కెట్ కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహం నుండి భద్రాచలం అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న డా. బీ. ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కార్యక్రమం కొనసాగనుంది. అని ప్రెస్ మీట్ లో తెలియజేసినారు.

# ఆత్మహత్య చేసుకున్న మల్లీశ్వరి కుటుంబాన్ని పరామర్శించిన నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



నీలగిరి వార్త /ఏప్రిల్ 18 / హాలియా ప్రతినిధి :శంకర్

నిడమనూరు మండలం బొక్కమంతలపాడు గ్రామం దళిత సామాజిక వర్గానికి చెందిన ధర్మారపు మల్లేశ్వరి ఇటీవల ఆత్మహత్య చేసుకోవడం వలన వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన నాగార్జునసాగర్ మాజీ శాసన సభ్యులు నోముల భగత్ కుమార్. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాటి సత్యపాల్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లం రవి, మాజీ మార్కెట్ చైర్మన్ కామెర్ల జానయ్య, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మెరుగు రామలింగయ్య, మండల ప్రధాన కార్యదర్శి నల్లమోతు వెం కటేశ్వర్లు, మాజీ సర్పంచ్లు పిల్లి రమేష్, సైదులు,మాజీ ఎంపీటీసీ సం తోష్, మాజీ కోఆప్షన్ నెంబర్ సలీం,ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి భాస్కర్, గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడు లచ్చిరాంకు గౌరవ డాక్టరేట్ ప్రధానం



చండూరు, నీలగిరి వార్త ప్రతినిధి, ఏప్రిల్ 18:

నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గా పనిచేస్తున్న ఉదావత్ లచ్చిరాం కు గురువారం రాత్రి హైదరాబాద్ నాంపల్లిలో సురవరం ప్రతాపరెడ్డి (పొట్టి శ్రీరాములు) తెలుగు విశ్వవిద్యాలయంలో నందమూరి తారక రామారావు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ చైర్మన్ రమేష్ ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారి నుంచి హానరీ డాక్టరేట్ అవార్డు ను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాను కరోనా సమయంలో చేసిన సేవలు, పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు గుణాత్మక విద్యను అందించడం, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించడం,పర్యావరణం, మహిళా సాధికారిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం వంటి మొదలగు వివిధ అంశాల్లో చేసిన సేవలను గుర్తించి "మహిళా సాధికారత మరియు సామాజిక సేవ" అంశంలో యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ అవార్డు కు ఎంపిక చెయ్యడం సంతోషంగా ఉందని, ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆకుల రమేష్, డాక్టర్ గూడూరు చేన్నారెడ్డి, డాక్టర్ మల్లాది విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంకు ఎంపికైన వెంకటాపురం మండలం పైలెట్ ప్రాజెక్టుకు హాజరైన. ..

## మంత్రులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, దనుసరి అనసూయ (సీతక్క), ఎంపీలు,ఎమ్మెల్యేలు



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

తెలంగాణ రాష్ట్రంలో భూ భారతి చట్టం క్రింద ములుగు జిల్లా వెంకటాపురం మండలం పైలట్ ప్రాజెక్టు ఎంపిక కాగా నేడు వెంకటాపురం మండల పరిధిలోని రైతులకు భూ భారతి చట్టం పై నిర్వహించే అవగాహన సదస్సు కార్యక్రమంలో రెవిన్యూ గృహ నిర్మాణాల ఐ%డ%పిఆర్ శాఖల పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అటవి పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రివర్యులు కొండా సురేఖ స్థానిక శాసనసభ్యురాలు రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు ధనసరి అనసూయ (సీతక్క) మహబూబబాద్ ఎంపి బలరాం నాయక్, సహచర ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో కలిసి పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి తొలుత ములుగు గట్టమ్మ తల్లి దగ్గర నుంచి వెంకటాపురం గ్రామం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీ లో మంత్రులతో కలిసి పాల్గొన్నారు.

అనంతరం సభ లో ఎమ్మెల్యే నాగరాజు గారు మాట్లాడుతూ.

ములుగు జిల్లా ప్రజలతో, వెంకటాపూర్ ప్రజలతో నాకు పోలీస్ ఉద్యోగ రీత్యా చాలా అభినవాసంబంధం ఉ



ఒదన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ధరణి పోర్టల్ తో గత 10సం.లో రైతులకు ఇబ్బందలకు గురి చేయగా పిసిసి అధ్యక్ష హోదాలో సీఎం రేవంత్ రెడ్డి మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ధరణి నీ బంగాళాఖాతం లో కలుపుతా అన్న మాట ప్రకారం నేడు రైతుల భూ భారతి చట్టం తీసుకొని వచ్చి గతంలో ధరణి పోర్టల్‌లో లాగా కాకుండా రైతులకు మేలు జరిగే ప్రయోజనాలను పొందుపరచి రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి ప్రజలు, రైతుల అభిప్రాయాలను స్వీకరించడం జరిగిందన్నారు. అందరి అభిప్రాయాల మేరకు భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అదేవిధంగా ప్రజలతో, ప్రజలందరి మధ్యలో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉండాలని తమకు సూచించారని అన్నారు. రైతు రుణమాఫీ విషయంలోనూ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదలకు సన్న బియ్యంను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిందని అన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే ఊరుకునేది లేదన్నారు. భూ భారతి చట్టం జూన్ రెండవ తేదీ నుండి ఆన్లైన్ అవుతుందన్నారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ భూములు కాపాడుకునే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా తప్పనిసరిగా న్యాయం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ సెక్రటరీ రామకృష్ణ, జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబ్ల్యూఎంఈ చర్చ్‌లో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు




నీలగిరి వార్త, సూర్యాపేట:-

మానవాళిని ఉద్ధరించేందుకు భూమిపై అవతరించి సర్వజనుల కోసం రక్తం చిందించిన మానవతా మూర్తి ఏసుక్రీస్తు ప్రభువు అని జిల్లా కేంద్రంలోని డబ్ల్యూఎంఈ చర్చ్ పాస్టర్ జాన్ మార్క్ అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని సూర్యాపేట పట్టణంలోని గోపాలపురంలో గల డబ్ల్యూఎంఈ చర్చ్ లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు అత్యంత పర్వదినంగా చేసుకునే పండుగల్లో గుడ్ ఫ్రైడే ఒకటని అన్నారు. సర్వమానవాళి సౌభ్రాతృత్వం కోసం ఏసు ప్రభువు తన రక్తాన్ని చిందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం, రాజు, బిక్షం,జాన్, జాకబ్, ప్రవీణ్, శ్రీను, పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా గోమాత పూజ



నీలగిరి వార్త హుజూర్ నగర్ రూరల్.

మండల పరిధిలోని శ్రీ ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి దివ్య క్షేత్రము బూరుగడ్డ లో శుక్రవారం గోపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. గోపూజ కు సహకరించిన భక్తులు ములుగు భాస్కర్ ధర్మపత్ని వీణా దంపతులు .యూ ఎస్ ఏ, వాస్తవ్యులు,ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ యరగాని గురవయ్య, ధర్మకర్తలు. గంధం అంజయ్య, తిపురిశెట్టి హరీష్, మేరీగా కవిత, వేముల నరసింహారావు, కోల కృష్ణ ప్రసాద్, పెనుబేల్లి హనుమంతరావు, ఆలయ అర్చకులు హరీష్ కుమారాచార్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, మరియు గూడుపు నాగలింగం, చంద్రయ్య, అంజయ్య, అచ్చాలు, వీరబాబు, బ్రహ్మం, వెంకటనారాయణ, సత్యనారాయణ, సైదులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, అనసూర్యమ్మ, పుష్ప, సావిత్రమ్మ, అంజమ్మ, నవ్య, పద్మ, పల్లవి, వీర కుమారి, మరియు ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ఖ

# తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## టిడిపి నేత మండవ వెంకటేశ్వర్లు గౌడ్

నీలగిరి వార్త గరిడేపల్లి..

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు , కార్యకర్తలు కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ హుజూర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జి మండవ వెంకటేశ్వర్లు గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం గరిడేపల్లి మండలం తాళ్ల మల్కాపురంలో తెలుగుదేశం ఇన్సూరెన్స్ సభ్యత్వ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని ఏదైనా ప్రమాదంలో సభ్యత్వం ఉన్న కార్యకర్త మరణిస్తే 5 లక్షల బీమా సౌకర్యాన్ని పార్టీ కల్పించిందని అన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి ఆదరణ లభిస్తుందని , నేటి పాలకుల పనితీరు నచ్చక పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో సభ్యత్వ కార్డుల



పంపిణీ కార్యక్రమం జరుగుతున్న దని అందరూ సభ్యత్వ కార్డులను స్వీకరించాలనికోరారు .వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగత నిర్మాణం చేపట్టి పార్టీని బలోపేతం చేస్తున్నామని మండవ వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు. త్వరలో హుజూర్ నగర్ నియోజకవర్గంలో వార్డు గ్రామ మండల కమిటీ నిర్మాణాలను ఏర్పాటు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో తాళ్ల మల్కాపురం గ్రామ శాఖ అధ్యక్షులు చామకూరి రామ్మూర్తి గౌడ్ .వార్డు సభ్యులు బత్తిని లక్ష్మయ్య గౌడ్. మండవ శేష గౌడ్. అనంత నరసయ్య గౌడ్ . మేకపోతుల రామకృష్ణ , అనంతు కాశయ్య .వట్టుకూటి వెంకటేశ్వర్లు .కోట వెంకటేశ్వర్లు.కత్తి వెంకటేశ్వర్లుకోట అంజయ్య .కోట సైదులు . గుండెపంగు అభి .కోట ప్రవీణ్, కుర్రి ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



**ముదిగొండ, నీలగిరి వార్త ఏప్రిల్ 18:**
ముదిగొండ మండలంలోని ముదిగొండ మరియు వనంవారి కిస్టాపురం గ్రామాల్లో పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.అశోక్ మాట్లాడుతూ, మే 16వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామాల వారీగా టీకాల పంపిణీ కార్యక్రమం పూర్తిచేస్తామని తెలిపారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత నిరసన ర్యాలీ





**భద్రాచలం టౌన్ నీలగిరి వార్త**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు బిల్లుకు నిరసనగా భద్రాచలం అంబేద్కర్ సెంటర్ నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు ముస్లిం మసీదుల కమిటీలు మరియు అఖిలపక్ష పార్టీలు ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు,రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య.సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు,అఖిలపక్ష పార్టీల నాయకులు,ముస్లిం, సోదరులు,తదితరులు పాల్గొన్నారు.

## నాయుడు కుండ బిర్యాని రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ నీలగిరి వార్త.**
హనుమకొండ సుబేదారిలోని నాయుడు గారి కుండ బిర్యాని రెస్టారెంట్ 36వ బ్రాంచ్ ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎంపీ డా.కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ...వినియోగదారులకు మెరుగైన సేవలు అందించినప్పుడే అందరి మన్ననలు పొందవచ్చునని అన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా వారంలో ఒక సారైనా కుటుంబంతో కలిసి రెస్టారెంట్ కు వస్తారని, వారిని దృష్టి లో ఉంచుకుని నాణ్యమైన రుచికరమైన భోజన సేవలు కల్పించాలన్నారు. అలాగే రెస్టారెంట్ వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## నాసా కాంటెస్ట్‌లో జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్న విద్యార్థులు



**హనుమకొండ నీలగిరి వార్త.**
నాసా కాంటెస్ట్ లో అశోక వనం ప్రాజెక్ట్ (ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్ మెంట్ కాంటెస్ట్ రిజల్ట్స్ 2025) జాతీయ స్థాయిలో నిర్వహించినటువంటి పోటీలలో హనుమకొండ శ్రీ చైతన్య సి.బి.ఎస్.ఇ స్కూల్ విద్యార్థులకి జాతీయలో స్థాయి లో ప్రథమ బహుమతి లభించింది. ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్ మెంట్ కాంటెస్ట్ లో జాతీయ స్థాయి లో ప్రథమ బహుమతిని సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాగే అన్ని రంగాల లో రాణించి పాఠశాల యాజమాన్యానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుక రావాలని ఆకాంక్షించారు. అకాడమిక్ డీన్ బైరు శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ నాసా ఆధ్వర్యంలో ఎన్ ఎస్ఎస్ స్పేస్ సెటిల్ మెంట్ కాంటెస్ట్ లో మా పాఠశాల విద్యార్థులు స్పేస్ హోటల్ అనే అంశం పైన చేసిన అశోక వనం అనే ప్రాజెక్ట్ ప్రథమ బహుమతి గా జాతీయ స్థాయి లో ఎంపిక కావడం గర్వం గా ఉందని తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్,పాఠశాల డైరెక్టర్ శ్రీవిద్య,డిజిఎం చేతన్, ఏజిఎం పి.రాజేశ్వర్ రెడ్డి, %గ్గూజ% శివ కోటేశ్వరరావు,నాసా ఇంచార్జ్ పి.శశి కుమార్ ఉపాధ్యాయలు,తల్లిదండ్రులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## మైనర్లు వాహనం నడిపిన, వారిని ప్రోత్సహించిన ఇక్కట్లు తప్పవు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**
మైనర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన అలాగే, వీరిని ప్రోత్సాహస్తూ వాహనాలు అందజేసిన చట్టపరమైన ఇక్కట్లు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతొంది. ముఖ్యంగా తెలిసి తెలియని వయస్సులోని మైనర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్య ఘణనీయంగా పెరిగే అవకాశం వున్నందును ఇలాంటి ప్రమాదాల నివాణకై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠిన చర్యలు తీసుకోవడంతో జరుగుతోంది. వరంగల్ కమిషనరేట్ పరిధిలో మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు చిక్కితే కేసు నమోదు చేసి వాహనం స్వాధీనం చేసుకొవడంతో పాటు వాహనం నడిపినందుకు గాను సదరు మైనర్‌ను కోర్టులో హరజర్‌పర్చి న్యాయమూర్తి అదేశాల మేరకు పరిశీలన గృహంకు (అబ్జర్వేషన్ హెూం) పంపబడుతుంది. అలాగే వాహన యజమాని గాని లేదా మైనర్ తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేసి వారికి కౌన్సిలింగ్ ఇవ్వబడుతుందని. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనం అంద జేయడం కూడా నేరమని వాహనదారులు గమనించాలని, ఒక వేళ లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడితే వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వాహన యజమానికి కూడా జరిమానా విధించడంబడటంతో పాటు వాహనం స్వాధీనం చేసుకోబడుతుందని ముఖ్యంగా మైనర్లు వాహనం నడుపుతూ ఏదైన ప్రమాదం జరిగి మరణం సంభవిస్తే, మో టార్ వాహన చట్టం అనుసరించి వాహన యజమానికి మూడు సంవత్సరాల జైలు శిక్ష లేదా 25వేల రూపాయల జరిమాన విధించడం జరుగుతుందని పట్టు బడిన మైనర్లకు 25 సంవత్సరా లు వయస్సు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ అర్హత కోల్పో తాడని, పట్టుబడిన వాహనం రిజిస్ట్రేషన్ ఒక సం వత్సర కాలం రద్దు చేయడం జరుగు తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ హె చ్చరించారు. వరం గల్ పోలీస్ కమినరేట్ పరిధిలో గత జనవరి మాసం నుండి ఇప్పటి వరకు 63 మంది మైనర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన సంఘటనల్లో మొత్తం 35278 కేసులు నమోదు చేసి 12552 వాహనాలు స్వాధీనం చేసు కొవడం చేసుకోవడంతో పాటు వాహనం అందజేసిన వాహన యజమానులకు 16 లక్షల 47 వేల రూపాయల జరి మాన విధించడం జరి గిందని పోలీస్ కమిషనర్ వెల్లడిరచారు. ఇకనైన తల్లి దం డ్రులు, వాహన యజమానులుమైన ర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలను అందజేసే చిక్కుల్లో పడవద్దని పోలీస్ కమిషనర్ సూచించారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ నీలగిరి వార్త.**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గం వరంగల్ 11 వ డివిజన్ లో ఎం.పి ల్యాడ్ నిధులతో 15 లక్షల రూపాయలతో రంగంపేట సిసి రోడ్డు నిర్మాణానికి వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్ ఎం.పి. కడియం కావ్యాతో కలిసి శంకుస్థాపన శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని చెప్పిన ప్రతి హామీ అమలు చేసే తీరుతామని అన్నారు. డివిజన్‌లోని ప్రతి వార్డులో రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్ న నిర్మాణం చేపడుతామని అన్నారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలి.
మంజూరు చేసిన పనులను నిర్ణీత సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి సంక్షేమం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం సమపలలో సాగుతుందని అన్నారు .ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభు త్వం ముందు వెళ్తుందని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గన్నారపు సంగీత్ కుమార్, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, నాయకులు మహమ్మద్ సమద్, సయ్యద్ అజ్గర్, మాడిశెట్టి రాజ్ కుమార్, గద్దల శివ ప్రసాద్, గన్నారపు కమల్, రమేష్, క్రాంతి, పవన్, మాలతి, సుభద్ర, మహేష్, నిర్మల, ఝాన్సి తదితరులు పాల్గొన్నారు,.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

### రైతులకు హార్వెస్టర్ ద్వారా వరి కోత విధానం పై అధికారులు అవగాహన కల్పించాలి.

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.



**నర్సంపేట నీలగిరి వార్త.**
నెక్కొండ మండలం, గోట్లకొండ గ్రామంలో మహిళ సంఘాలచే నిర్వహించే గాయత్రి వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణిలు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఏకాకాలంలో రెండు లక్షలు రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణా ప్రజా ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. వాతావరణ సూచన మేరకు ధాన్యం రాశుల వద్ద టార్పిలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని రైతులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. సన్న రకం వడ్లకు క్వింటాల్ కు 500/- రూపాయలు బోనస్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. ధాన్యం కొనుగోలు ను వేగవంతం చేసి లోడింగ్ రవాణా త్వరిత గతిన పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలి. గన్ని సంచుల కొరత లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవికాలం కాబట్టి వీలైనంతగా నీడలో ఉండాలని రైతులకు సూచించారు.
ప్రజల సంక్షేమం,రైతు అభివృద్ధి మా ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరి కోతలపై రైతులకు అవగాహన కల్పించి ప్యాడి క్లీనర్ లను పూర్తిస్థాయిలో ఉపయోగించి ధాన్యంలో తాలు లేకుండా , 17% మాయిశ్చర్ తగ్గకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ కిష్టయ్య, డి ఎం సివిల్ సప్లై సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాల సమస్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు పోతానాని

### హామీ ఇచ్చిన మంత్రి దామోదర రాజనర్సింహ



**నీల గిరి వార్త భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో**
కొత్తగూడెం నందు జరిగి సమావేశం లో షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మర శ్రీనివాసు మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులు,అధికారాలు కోల్పోయిన ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాల సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను హైదరాబాద్ తన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేసి క్షుణ్ణముగా వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాల స్థానిక రాజకీయ రిజర్వేషన్లు,సాగు భూములకు హక్కు పత్రాలు,స్థానిక ఉద్యోగ నియామకాలు లేకుండా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీ నిరుపేదలను నాన్ ట్రైబ్స్, గా అభివృద్ధి చెందిన కులాలతో జతకట్టి అభివృద్ధికి దూరం చేశారని విషయం తెలియజేశారు. స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ ఏజెన్సీ ప్రాంత స్థానిక ఎస్సీ కులాల స్థానిక రిజర్వేషన్లు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారం జరిగే వరకు వదిలిపెట్ట బోనని మంత్రి రాజనర్సింహ హామీ ఇచ్చినారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ గౌరవ సలహాదారు హైకోర్టు న్యాయవాది మల్లన్న,రాష్ట్ర కమిటీ సభ్యులు బలవంతపు సంపత్ కుమార్, రజిని అంబేద్కర్,రాష్ట్ర కోఆర్డినేటర్ ఎనగంటి కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం



**ఇల్లందు నీలగిరి వార్త ప్రతినిధి ఏప్రిల్ 18:**
కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని తక్షణమే ఆ చట్టాన్ని వెనక్కి తీసుకొని రాజ్యాంగాన్ని కాపాడాలని ముస్లిం మత పెద్దలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించి అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ చట్టం దేశంలో దాదాపు 72 రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ సాక్షిగా దేశవ్యాప్తంగా 9లక్షల 40వేల ఎకరాల భూములు వక్ఫ్ బోర్డు కి ఉన్నాయని ఆ భూములు దుర్వినియోగం అవుతున్నాయని అబద్ధపు ఆరోపణలు చేసి బిల్లు ఆమోదం చేసారని అన్నారు. నరేంద్ర మోడీకి ముస్లింలపై ప్రేమ లేదని వక్ఫ్ బోర్డ్ భూములను



లాక్కొని అంబానీ ఆదానిలకు కట్టబెట్టాలని చూస్తున్నారని అన్నారు. తక్షణమే వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని హాస్పటల్‌కు చేర్చిన దేవరుప్పుల పోలీసులు



**జనగాం నీలగిరి వార్త.**
రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించి దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ మానవత్వం చాటుకున్నారు. గత అర్ధరాత్రి బైకుపై వెళ్తూ జారి కిందపడి తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పొదల్లో పడి ఉన్న యువకుడిని, అదే సమయంలో అ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి హాస్పటల్‌కు తరలించారు. కాగా, గాయపడిన వ్యక్తిని అనిల్‌గా గుర్తించారు.

## ధరణితో టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది

### అటువంటి సమస్యలు తొలగించేందుకు భూభారతి తీసుకొచ్చాం

### మంత్రి కొండా సురేఖ



**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**
భూములు ఈరోజు మీ నుంచి లాక్కుంటే బాధ ఎలా ఉంటుందో బిఆర్ఎస్ ప్రభుత్వానికి తెలియ లేదు కావచ్చుని... కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కళ్ళల్లో నీళ్లు రావద్దని వారు కోల్పోయిన భూములను తిరిగి వారికే మళ్లీ రాసియాలనే ఒక లక్ష్యం తోటి ఈ రోజు భూభారతి చట్టాన్ని తీసుకు వచ్చి మీ కళ్ళల్లో నీళ్లు తుడిచేటువంటి ప్రయత్నం చేయడం జరుగుతుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఐ టి డి ఏ ప్రిన్సిపల్ సెక్రెటరీ బానోత్ శరత్ నాయక్



**వరంగల్ సిటీ నీలగిరి వార్త.**
వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని %×ుణూ% ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ భానోత్ శరత్ నాయక్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ శరత్ నాయక్ కి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో శరత్ నాయక్ కి ఆలయ అర్చకులు మహదాశివచనం నిర్వహించి నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

## సుజోయ్ పాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ ప్రావీణ్య



**హనుమకొండ నీలగిరి వార్త.**
తెలంగాణ రాష్ట్ర తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్ పాల్ హనుమకొండకు శుక్రవారం విచ్చేయగా హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ డి.సి.సి. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు రాగా ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిజస్టిస్‌సుజోయ్‌పాల్‌ను జిల్లాకలెక్టర్ ప్రా వీణ్య మర్యాదపూర్వకంగాకలిసిమొక్కనుఅందించిస్వాగతం పలికారు.

## 11కేవీ లైన్ వైర్‌లను షిఫ్టింగ్‌ను ప్రారంభించిన ఎంఎల్ఏ



**పరకాల నీలగిరి వార్త.**
శుక్రవారం ఆత్మకూరు మండలం నీరుకుల్లా గ్రామంలో ఇండ్లపై నుండి వెళ్తున్న కరెంట్ 11కేవీ లైన్ వైర్‌లను షిఫ్టింగ్ చేసే కార్యక్రమా న్ని అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యుత్ అధికా రులతో కలిసి నూతన కరెంటు స్తంభాలను జనావాసాలకు దూ రంగా నాటించారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీరుకుల్ల క్రాస్‌రోడ్ వద్ద గల ప్రభుత్వ భూములను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారికి 100 గజాల ఇంటి స్థలాన్ని పంపిణీచేసి,ఒకమోడల్‌కాలనీగా తీర్చిదిద్దబోతున్నామని తెలిపారు.